# వివక్ష

రాజిని ఇంట్లో పనికి పెట్టుకోవడం మొదట్లో మా వారికి అసలు ఇష్టం లేదు. కొత్తగా వెలసిన ఆ కాలనీకి వెళ్ళి అక్కడ మా స్వగృహంలో చేరిన రోజున పనిమనిషి కోసం వాకబుచేశాను. ఇరుగు పొరుగున మరీ దగ్గరగా ఉన్న ఇళ్ళలో ఎవరూ ఇంకా చేరలేదు. పనిమనిషిలా కనిపిస్తున్న ఒకామెని ఆ దారిన పోతూంటే అడిగాను ఎవరైనా పనిమనిషి తెలుసునా అని "సరే పంపిస్తలే" అని వెళ్ళిపోయింది.

సాయంకాలం ఒకామె ఒక చిన్న అమ్మాయిని వెంటపెట్టుకుని వచ్చి, ఆ పిల్లని పనిలో పెట్టుకోమని చెప్పింది. తనకి ఖాళీ లేదుట. ఆ పిల్ల తన మరిది కూతురుట. తన యారాలు ఈ మధ్యనే కడుపులో గడ్డని ఆపరేషన్ చేస్తూంటే చచ్చిపోయిందిట. ఈ పిల్లని ఈమె దగ్గరే ఉంచి, మరిది కొడుకుని తీసుకుని వేరే ఊరికి వెళ్ళాడుట కూలి కోసం.

"ఇంత చిన్నపిల్లని పెట్టుకోవడం ఏమిటి"? అన్నాను. ఆ పిల్లకి పదేళ్ళుంటాయి. అంతే.

"సిన్నదైనా పని మంచిగ చేస్తుందమ్మా, దాని పొట్ట అది పోసించుకుంటే, మాకు కొంత సాయంగ ఉంటది" అంది ఆమె.

మేమిద్దరం ఆఫీసులికి వెళ్ళాక ఇల్లు కనిపెట్టుకుని ఉంటుందిలే అనుకుని, "సరే పంపించు" అన్నాను. తక్కిన విషయాలు మాట్లాడాక, "మీ ఆయన ఏం చేస్తుంటాడు?" అని అడిగాను.

"ఆయన మునిసిపాలిటీలో సఫాయి పని చేస్తడు. నేను దవాఖానలో సఫాయి పని చేస్త" అంది.

తరవాత మా వారితో ఈ సంగతి చెప్పగానే, "ఛీ, అటువంటి వాళ్ల పిల్లని పనిలో పెట్టుకోవడం ఏమిటి? ఇంకెవరినైనా చూడు" అన్నారు.

"వాళ్ళు ఎవరైతేనేం! పిల్ల బాగానే ఉంది. చిన్నదైనా పనిపాటలు బాగా చేస్తుందిట. అయినా, నేను మనింట్లో కమోడ్లు శుభ్రం చేస్తుండగా లేనిది వాళ్ళు మనింట్లో పనిచేస్తే తప్పేముంది?" అన్నాను.

ఆయన ఇంక వాదించలేదు.

రాజి ఇంటి పనులన్నీ చేస్తోంది గాని, దాన్ని నేను వంటింట్లోకి మాత్రం రానివ్వలేదు. మా అమ్మ ఆచారం ప్రభావంవల్లో, మా అత్తగారికి కూడా కాస్త పట్టింపు ఉండటం వల్లో, మొదటి నుంచీ పని మనిషిని వంటింట్లోకి రానివ్వక పోవడం అలవాటైంది. ఒకరోజున పొయ్యి మీద పాలు పెట్టి మరిచి పోయి బజారుకి వెళ్ళాను. వచ్చేటప్పటికి పాలు మరిగి పోయి గిన్నెమాడి పోయింది. అప్పటి నుంచీ రాజిని వంటింట్లోకి రానివ్వడం మొదలు పెట్టాను. వంటింట్లో పై పనులు చెయ్యడంలో సాయం చేస్తోంది.

రాజి చాలా తెలివైన పిల్ల. అన్నీ సూక్ష్మంగా పరిశీలించి ప్రశ్నించేది. ఇది వరకు ఎక్కడా పెద్దవాళ్ళ ఇళ్ళలో పనిచెయ్యక పోవడం వల్లనేమో, వివక్షకి గురై ఉండదు. తను కూడా కుర్చీలో కూర్చుని మాతో పాటు టి.వి. చూడాలని ఉండేది. కింద కూర్చోకుండా కుర్చీ అంచున కూర్చోబోతుంటే, ఒక స్టూలు ఇచ్చి దాని మీద కూర్చోమన్నాను. అయిష్టంగానే ముఖం పెట్టి కూర్చుంది. కొంత సేపయాక స్టూలుని గోడ దగ్గరికి లాక్కుని గోడకి ఆనుకుని కూర్చుంది. గోడకి రాజి తల అంటుకుని గోడ మీద నూనె మరక అవుతుందని భయపడినా, గత్యంతరం లేక ఊరుకున్నాను.

రాజి మా ఇంట్లో చేరగానే దానికి ఒక చిన్నకంచం, గ్లాసూ ఇచ్చాను. మొదట్లో చాప మీదపడుకునేది. తరవాత చలికాలం ప్రవేశించాక, ఒక పొడుగు బల్ల మీద పడుకోమన్నాను. తన పక్క బట్టలు దాని మీదే వేసుకునేది. క్రమంగా తన కంచం, గ్లాసూ విడిగా నేలమీద పెట్టుకోకుండా, తోమిన తరవాత తక్కిన కంచాలూ, గ్లాసులతోపాటు పెట్టడం మొదలుపెట్టింది. కంచం చిన్నది కాబట్టి తెలుస్తుంది. దానిది అని. గ్లాసు దానిది అని తేడా తెలియడం లేదు. వాటిని విడిగా పెట్టుకోమని చెప్పాలనిపించింది. ఎందుకు పెట్టుకోవాలని అడిగితే ఏం సమాధానం చెబుతాను? అది తాగిన గ్లాసుని కడిగినా, దానితో మేము తాగమని ఎలా చెప్పగలను? కాఫీ హోటళ్ళలోనూ, ఆఫీసు కేంటీన్లలోనూ ఎవరెవరో తాగిన గ్లాసుల్నీ కప్పుల్నీ అందరికీ ఇస్తుంటారు కదా. అక్కడ తాగగా లేని అభ్యంతరం ఇంట్లో ఎందుకు అని సమాధాన పడ్డాను.

అన్నింటికీ మాతో సమానత్వాన్ని కోరుకునేది రాజి. మా సబ్బు పక్కనే దానికిచ్చిన సబ్బు పెట్టుకుంటూంటే వేరుగా పెట్టుకోమన్నాను. ప్రతిదానికీ నేను తప్పు చేస్తున్నట్లు నా మనసులో కెలుకుతున్నట్లుండేది.

ఈ కులాలూ అంతస్తులూ నేను పెట్టినవి కావు. సమాజంలో తరతరాలుగా ఉన్నాయి. రాజిని వీలైనంత వరకు ఇంట్లో పిల్లలాగే చూస్తూండేదాన్ని. కానీ పని పిల్ల అన్న ఆలోచన నా మనస్సులోంచి పోదు కదా. పనిచేస్తున్నా నేనూ వాళ్ళలాంటి దాన్నే అనే ఆలోచన రాజి మనసులో ఉండేదనుకుంటాను. రాజీపడలేని స్వభావం రాజిది.

మేమిద్దరం ఆఫీసుకి వెళ్ళిపోయాక రాజికి సమయం గడవటం కష్టమే. ఇంటి పనులు చెయ్యడం అయాక కొంత సేపు నిద్ర పోయినా, మిగిలిన సమయంలో ఏమీ తోచక వరండాలో కూర్చుని రోడ్డు మీద వచ్చే పోయే వాళ్ళని చూస్తూండేది. బొమ్మల పుస్తకాలు కొని తెచ్చి ఇచ్చాను. ఆసక్తిగా చదవడం మొదలు పెట్టింది. మూడో క్లాసుతోనే చదువు ఆగిపోయింది రాజికి.

రాజికి ఇంగ్లీషులో మాట్లాడటం, రాయడం నేర్పించాలనిపించి, బాగా తెలిసిన వస్తువులకే ఇంగ్లీషు పేర్లు చెప్పి, వాటితో వాక్యాలు చెప్పాలనుకున్నాను. లైట్, స్విచ్, పేపర్, పెన్, టేబుల్, బకెట్ వంటి పదాలతో మొదలు పెట్టి వాక్యాల్లో చెప్పబోతూంటే, "అమ్మా, ఇవి ఇంగ్లీషు మాటలేంటి! మా పెద్దమ్మకీ, నాయినమ్మకీ కూడా ఈ మాటలొచ్చు" అంది.

"ఇవి ఇంగ్లీషు మాటలే. అందరికీ వాడటం అలవాటయిపోయింది. అవే మాటలతో తెలుగులో వాక్యాలు చెప్పడం వేరు, ఇంగ్లీషులో చెప్పడం వేరు. వాక్యాలు చెప్పడానికి ఇతర ఇంగ్లీషు పదాలు కూడా నేర్చుకోవాలి. ముందు నేను చెప్పినట్లు నేర్చుకో" అన్నాను.

రాజికి నా సమాధానం నచ్చలేదు. మావారు కూర్చున్న చోటికి వెళ్ళి, "అయ్యా, అమ్మ లైటు, పెన్ను, టేబులు, బకెట్టు ఇయన్నీ ఇంగ్లీషు మాటలంటున్నది. నిజంగ నేనా?" అని అడిగింది.

ఆయన సమాధానం చెప్పకుండా నాకేసి చూసి చిరునవ్వు నవ్వుతున్నారు.

నాకు తలకొట్టేసినట్లనిపించింది. నేనూ ఆయనలాగా చదువుకున్నదాన్నే. ఉద్యోగం చేస్తున్న దాన్నే. అయినా, నా కన్న ఆయన మాటకే విలువ నివ్వడం నాకు బాధనిపించింది. కానీ అంతలోనే మరొక ఆలోచన మనస్సులో మెదిలింది. స్త్రీ పురుష వివక్ష నాకు బాధ కలిగించినట్లుగానే, కుల వివక్షతోనూ, అంతస్తు వివక్షతోనూ రాజి మాత్రం బాధపడటం లేదా? రాజి పెరిగి పెద్దయాక, ఈ వివక్షలన్నిటితో మరిన్ని బాధలు అనుభవించాలేమో.

రాజి తెలివైన పిల్ల. మరింత చైతన్యవంతురాలిగా పెరిగే అవకాశం ఉంది. ఆ పిల్ల చేత ఇంట్లో పని చేయించడం నేరమే. ఈ పని మానిపించి స్కూల్లో చేర్పించడం మంచిదని తోచింది.

"రాజీ, మీ పెద్దమ్మ నొకసారి రమ్మని చెప్పు" అన్నాను.

"ఎందుకమ్మా?" అంది కంగారు పడుతూ.

"వేరే పనిమనిషిని చూడమని చెబుతాను నువ్వు చిన్నపిల్లవి కదా" అన్నాను.

"అదేంటమ్మా, నేను పని మంచిగ సెయ్యటం లేదా?" అని అడిగింది ముఖం చిన్నబుచ్చుకుని.

"అది కాదు. నువ్వు చదువుకోవలసిన వయస్సులో ఉన్నావు. స్కూలుకి వెళ్ళి బాగా చదువుకోవాలి. నీ చదువు గురించి అయ్యే ఖర్చు నేను పెట్టుకుంటానులే, భయపడకు" అన్నాను.

రాజి ముఖం పున్నమి చంద్రుడిలా వెలిగింది.

*(చేతన, ఫిబ్రవరి 2007)*